క్లుప్తంగా

నేడు సమావేశం

శాయంపేట : మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయ సమావేశ మందిరంలో సోమవారం వివిధ శాఖల అధికారులతో భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు రివ్యూ సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ ఫణిచంద్ర ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటలకు రివ్యూ ఉంటుందని, అధికారులు హాజరు కావాలని కోరారు.

గుంతల పూడ్చివేత



ఆత్మకూరు : మండలంలోని కటాక్షపూర్ చెరువు మత్తడి ప్రదేశంలో జాతీయ రహదారిపై ఏర్పడిన గుంతలను సీఐ సంతోష్ ఆదివారం పూడ్చివేయించారు. గుంతలను పూడ్చడంతో వాహనదారులు కృతజ్ఞతలు తెలిపారు.

సత్యనారాయణకు వరించిన అవార్డు



ఆత్మకూరు : మండలంలోని నీరుకుళ్లకు చెందిన పానుగోటి సత్యనారాయణకు గిడుగువెంకటరామ్మూర్తి జయంతి సందర్భంగా విజయవాడలో ఆదివారం తెలుగు వెలుగు సంస్థ ఆధ్వర్యంలో జాతీయ నంది అవార్డు పురస్కారాలను అందించారు. అందుబాలో భాగంగా సత్యనారాయణ చేస్తున్న సామాజిక సేవలను గుర్తించి తెలుగువెలుగు జాతీయ నంది అవార్డును ప్రదానం చేశారు. తనకు అవార్డు రావడం సంతోషంగా ఉందని, ఈ అవార్డు మరింత బాధ్యతను పెంచిందని తెలిపారు.

వృద్ధులకు దుప్పట్ల పంపిణీ



ఐనవోలు : మండలంలోని పున్నేలు గ్రామంలో గల కనకదుర్గ వృద్ధాశ్రమంలో ఒంటిమామిడిపల్లికి చెందిన మజ్జిగ జైపాల్ తండ్రి వెంకటనర్సయ్య జ్ఞాపకార్థం వృద్ధులకు దుప్పట్లు, పండ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జైపాల్, హైమ, సంజయ్‌కుమార్, స్ఫూర్తి, నరేందర్, వెంకన్న, అశోక్, బీరయ్య, మురళి, శ్రీను, కిరణ్ పాల్గొన్నారు.

రూ.5 లక్షల విరాళం



ఆత్మకూరు : మండల కేంద్రంలోని పార్వతీదేవిసమేత మహాదేవ ఆలయ పునర్నిర్మాణానికి బూర దామోదర్ జ్ఞాపకార్థం ఆయన కుమారుడు బూర విద్యుల్లత–అమరేందర్ దంపతులు కుటుంబ సభ్యుల తరపున కమిటీ సభ్యులకు రూ.5 లక్షల విరాళం అందించారు. కమిటీ అధ్యక్షుడు వంగాల బుచ్చిరెడ్డి, సభ్యులు బూర కిశోర్‌కుమార్, సత్యనారాయణ, సంపత్, దేవేందర్‌రెడ్డి, సాగర్, జయపాల్‌రెడ్డి, తిరుపతిరెడ్డి, సతీష్ పాల్గొన్నారు.

నియామకం



ధర్మసాగర్ : మండల కేంద్రానికి చెందిన దాసరి సదానందం భారతీయ జనతా పార్టీ ఎస్సీ మోర్చా జిల్లా కార్యదర్శిగా నియామకం అయ్యారు. తనపై నమ్మకంతో ఈ బాధ్యతలు అప్పగించిన బీజేపీ జిల్లా అధ్యక్షురాలు రావు పద్మ, ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్షుడు సంద్ర మధుకు, సహకరించిన జిల్లా, మండల నాయకులకు సదానందం కృతజ్ఞతలు తెలిపారు.

చికిత్స పొందుతూ యువకుడి మృతి



సంతోష్

దామెర : చికిత్స పొందుతూ యువకుడు మృతి చెందిన సంఘటన ఆదివారం మండలంలోని సీతారాంపురం గ్రామంలో చోటు చేసుకుంటుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. సీతారాంపురం గ్రామానికి చెందిన భాష బోయిన సంతోష్ (22) హనుమకొండలోని ఓ ప్రైవేట్ కళాశాలలో చదువుతున్నాడు. 20 రోజుల క్రితం ఇంట్లో పురుగుల మందు తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు వరంగల్ ఎంజీఎం ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందినట్లు తెలిపారు.

జలసిరులు.. పచ్చని పైర్లు



పచ్చదనంతో నిండుకున్న పత్తిపంట



మండల కేంద్రంలో పచ్చదనంతో కళకళలాడుతున్న వరి



ఏపుగా పెరిగిన మొక్కజొన్న

- నిండుకుండలా చెరువులు
- పెరిగిన భూగర్భ జలాలు
- పచ్చదనంతో కళకళలాడుతున్న పంటలు



నిండుకుండలా గోపాల్‌పూర్ ఊర చెరువు

ఎల్కతుర్తి : జోరుగా కురిసిన వర్షాలతో మండలంలోని చెరువులు, కుంటలు నిండుకుండలా కనిపిస్తున్నాయి. దీంతో భూగర్భ జలాలు పెరిగడంతో వ్యవసాయ బావుల్లో పుష్కలంగా నీటిమట్టం పెరిగింది. చెరువులు, కుంటలు నిండిపోయి మత్తళ్లు దూకుతున్నాయి. మండల వ్యాప్తంగా సాగు చేసిన పంటలు పచ్చదనంతో కలకలలాడుతున్నాయి.

మండలంలో సాగు విస్తీర్ణం..

మండలంలో మొత్తం 19 గ్రామ పంచాయతీలకు మరో మూడు అనుబంధ గ్రామాలు ఉన్నాయి. 21,500 ఎకరాల సాగు విస్తీర్ణం ఉండగా.. ఇందులో 15,300 ఎకరాల్లో రైతులు వరిసాగు చేస్తున్నారు. 4,000 ఎకరాల్లో పత్తిపంట, 180 ఎకరాల్లో మొక్కజొన్న పంట సాగు చేస్తున్నారు. మిగతా ఎకరాల్లో తదితర పంటలు సాగు చేస్తున్నట్లు వ్యవసాయ శాఖ అధికారులు అంచనా వేశారు. ఇందులో పది గ్రామాలు ఎస్సారెస్పీ ఆయకట్టుకింద ఉండగా మరో తొమ్మిది గ్రామాలు పూర్తిగా మెట్ట ప్రాంతంలో ఉన్నాయి. మెట్ట ప్రాంతం రైతులు పత్తి, మొక్కజొన్న పంటలు సాగుచేయగా ఎస్సారెస్పీ ఆయకట్టు కింది రైతులు పూర్తిస్థాయిలో వరిపంట సాగు చేశారు. రైతులు సాగు చేసిన పంటలు ప్రస్తుతం పచ్చదనంతో నిండుకొని కలకలలాడుతున్నాయి.

సాయుధ పోరాటంలో ఎర్రజెండా పాత్ర కీలకం

- సీపీఐ జిల్లా కార్యదర్శి కర్రె భిక్షపతి

శాయంపేట : తెలంగాణ సాయుధ పోరాటంలో సీపీఐ కీలకపాత్ర పోశించిందని సీపీఐ జిల్లా కార్యదర్శి కర్రె భిక్షపతి అన్నారు. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట 76వ వారోత్సవాలను ఆదివారం మండల కేంద్రంలో మండల కార్యదర్శి బత్తిని సదానందం, సహాయ కార్యదర్శి అనుకారి అశోక్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు, కార్యకర్తలు, గుడిసె వాసులు ఎర్ర జెండాలతో డప్పుచప్పుళ్ల నడుమ స్థానిక అంబేడ్కర్ సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించారు, అనంతరం సాయుధ పోరాటయోధులు, సీపీఐ నాయకులు, అమరజీవి కామ్రేడ్ అనుకారి దామోదర్ స్థూపం వద్ద ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ప్రజల ధన, మాన, ప్రాణాలను కాపాడేందుకు కమ్యూనిస్టులు ఆంధ్ర మహాసభ ఏర్పాటు వీరోచిత పోరాటాలు చేశారని గుర్తు చేశారు. అనంతరం కామ్రేడ్ అనుకారి దామోదర్ సతీమణిని శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా సహాయ కార్యదర్శి తోట భిక్షపతి, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు ఆదరి శ్రీనివాస్, నదునూరి అశోక్, స్టాలిన్, నాయకులు రవి, రాజేందర్, అంకూషావళి, గౌసియా, రమేశ్, శ్యామ్, గట్టయ్య, భూషనం, గుడిసెవాసులు పాల్గొన్నారు.

పేకాటరాయళ్ల అరెస్ట్

శాయంపేట : మండలంలోని పత్తిపాక గ్రామ శివారులో గల గుట్టల్లో ఆదివారం పేకాడుతున్న 8 మందిని పట్టుకున్నట్లు ఎస్సై ప్రమోద్‌కుమార్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని పత్తిపాక శివారులోని గుట్టల్లో పేకాట ఆడుతున్నారనే సమాచారం మేరకు సిబ్బందితో కలిసి దాడులు నిర్వహించినట్లు తెలిపారు. ఇందులో నలుగురిని అదుపులోకి తీసుకోగా మరో నలుగురు తప్పించుకున్నట్లు పేర్కొన్నారు. 52 పేక ముక్కల, రూ.890 నగదును సీజ్ చేసి 8 మంది కేసు నమోదు చేసినట్లు తెలిపారు. గణేశ్, మధు, రాజు, కిరణ్‌ను పట్టుకోగా శ్రీకాంత్, మాదం మహేష్, సుతారి సాయిరాం, ఐరబోయిన వినోద్ పరారిలో ఉన్నట్లు వెల్లడించారు. ఈ దాడుల్లో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

ధాన్యం డబ్బులు చెల్లించాలని..

పురుగుల మందుతో రైతుల నిరసన



పురుగు మందుల డబ్బాలతో నిరసన వ్యక్తం చేస్తున్న బాధిత రైతులు

కమలాపూర్: తమకు రావాల్సిన ధాన్యం డబ్బులు వెంటనే చెల్లించాలని సీడ్ యజమాని ఎదుట పురుగుల మందుతో రైతులు నిరసనకు దిగిన సంఘటన కమలాపూర్ మండలం మాదన్నపేటలో ఆదివారం చోటు చేసుకుంది. బాధిత రైతులు తెలిపిన వివరాల ప్రకారం.. మాదన్నపేటకు చెందిన రైతులు వంగ సాంబయ్య, వంగ లింగమూర్తి, ఎగ్గడి సదయ్య, ఎగ్గడి సాంబయ్య, ఎగ్గడి శ్రీనివాస్, కుమ్మరి బాబు, కుమ్మరి భిక్షపతి, జక్కుల సతీష్, కిన్నెర నరేష్ కరీంనగర్ జిల్లా వీణవంకకు చెందిన రాకేష్ సీడ్స్ యజమాని నామని వెంకటేష్‌కు సుమారు పది నెలల క్రితం తాము పండించిన వరి ధాన్యం విక్రయించారు. మొత్తం డబ్బుల నుంచి కొంత చెల్లించిన సీడ్స్ యజమాని రూ.7.30 లక్షలు ఆపి ఇబ్బందులకు గురి చేస్తున్నాడని వాపోయారు. తిరిగి తిరిగి విసిగి పోయిన రైతులు ఆదివారం సీడ్స్ యజమాని వెంకటేష్‌ను మాదన్నపేటకు తీసుకొచ్చి రైతు వంగ సాంబయ్య ఇంటి వద్ద కూర్చోబెట్టారు. డబ్బులు వెంటనే ఇవ్వాలని, లేదంటే మందుతాగి చస్తామని పురుగు మందుల డబ్బాలతో నిరసనకు దిగారు. సమాచారం అందుకున్న ఎస్సై వీరభద్రరావు రైతులకు నచ్చజెప్పే ప్రయత్నం చేసినా శాంతించలేదు. పోలీసు అధికారులకు ఎన్నిసార్లు విన్నవించినా డబ్బులు ఇప్పించడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. డబ్బులు చెల్లించిన తర్వాతే యజమానిని తీసుకెళ్లాలని భీష్మించారు. అనంతరం రైతులు సీడ్ యజమానిని తీసుకొని పోలీస్ స్టేషన్‌కు చేరుకున్నారు. బాధితులు ఫిర్యాదు చేస్తే కేసు నమోదు చేసినట్లు సీఐ హరికృష్ణ తెలిపారు

వీధి కుక్కలతో జనం బెంబేలు

కాజీపేట: పట్టణంలోని పలు కాలనీల్లో వీధి కుక్కల సంచారం ఇటీవలి కాలంలో విపరీతంగా పెరిగింది. మునుపెన్నడూలేని విధంగా కుక్కలు కాలనీల్లో సంచరిస్తుండడంతో ప్రజలు తీవ్ర భయాందోళనలకు గురవుతున్నారు. బాటసారులు, వాహనదారుల వెంటపడి గ్రామసింహాలు కరుస్తున్నా పట్టించుకునే వారు లేకుండాపోయారనే విమర్శలు సర్వత్రా వ్యక్తమవుతున్నాయి. ఒక సిద్ధార్థనగర్ కాలనీలోనే వారం రోజుల్లో ముగ్గురు కుక్క కాటుకు గురికావడం చర్చనీయాంశంగా మారింది. బాపూజీనగర్, డీజిల్‌కాలనీ, ప్రశాంత్‌నగర్, రైల్వే క్వార్టర్స్, సోమిడి, వెంకటాద్రినగర్, జామామసీద్ గల్లీలో వీధి కుక్కల బెడద ప్రమాదకరంగా తయారైందని స్థానికులు వాపోతున్నారు. వీటి నివారణకు చర్యలు చేపట్టాలంటూ పలు కాలనీల ప్రజలు ఫిర్యాదు చేసినా మున్సిపల్ అధికారులు స్పందించడంలేదనే విమర్శలు వస్తున్నాయి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

భక్తిశ్రద్ధలతో గణపతి నిమజ్జనం



కమలాపూర్ : గణపతి శోభాయాత్రలో నృత్యాలు చేస్తున్న యువకులు



వేలేరు : గణపతి హోమం నిర్వహిస్తున్న భక్తులు



పరకాల : అన్నదానం చేస్తున్న సీఐ క్రాంతికుమార్

కమలాపూర్ : మండల వ్యాప్తంగా గణపతి నిమజ్జనోత్సవాలు ఆదివారం రాత్రి ఘనంగా జరిగాయి. నవరాత్రులు పూజలు అందుకున్న గణనాథులను ప్రత్యేకంగా అలంకరించిన వాహనాలపై ఆసీనులు చేసి భక్తిశ్రద్ధలతో భజనలు చేస్తూ, కోలాటాలు ఆడుతూ, నృత్యాలు చేస్తూ పురవీధుల గుండా శోభాయాత్ర నిర్వహించారు. అనంతరం ఆయా గ్రామాల్లోని చెరువులు, కుంటలు, వాగుల్లో నిమజ్జనం చేశారు. నిమజ్జనోత్సవాల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా స్థానిక ఇన్‌స్పెక్టర్ హరికృష్ణ, ఎస్సై వీరభద్రరావు ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు నిర్వహించారు. ఈ నిమజ్జనోత్సవ వేడుకల్లో భక్త, భజన మండళ్ల నిర్వాహకులు, ఉత్సవ కమిటీ సభ్యులు, మహిళలు, యువకులు, చిన్నారులు పాల్గొన్నారు. అంతకుముందు వినాయక మండపాల్లో దాతల సహకారంతో నిర్వాహకులు అన్నప్రసాద వితరణ చేపట్టారు.

గణపయ్యకు హోమం

వేలేరు : మండల కేంద్రంలోని యంగ్ గణపతి యూత్ ఆధ్వర్యంలో బీసీ కాలనిలో ఏర్పాటు చేసిన వినాయక మండపం వద్ద భక్తులు మహా హోమం నిర్వహించారు. పలు గ్రామాల్లోని వినాయక మండపాల వద్ద ప్రత్యేక పూజలు, అర్చనలు, అభిషేకాలు, కుంకుమార్చనలు, అన్నదానాలు నిర్వహిస్తున్నారు.

పరకాల : గణపతి నవరాత్రోత్సవాల్లో భాగంగా పట్టణంలో ఆదివారం శివాజీ యువసేన ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గణపతి మండపం వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని సీఐ క్రాంతికుమార్ ప్రారంభించారు. గణపతి విగ్రహ దాత, 21వ వార్డు కౌన్సిలర్ ఆర్పీ జయంత్‌లాల్, శివాజీ యువసేన నాయకులు ఆర్పీ దినేశ్, రామ్, నాగరాజు, అర్జున్, రాజ్‌కుమార్, మార్కేండేయ, ఈశ్వర్, రవి, రాజు పాల్గొన్నారు.

‘ఫర్టిలైజర్’ కమిటీ అధ్యక్షుడిగా మదన్‌మోహన్‌రెడ్డి

నల్లబెల్లి : ఫర్టిలైజర్, పెస్టిసైడ్స్, సీడ్స్ అసోసియేషన్ మండల అధ్యక్షుడిగా మండలంలోని కన్నారావుపేటకు చెందిన కాసం మదన్‌మోహన్‌రెడ్డి ఎన్నికయ్యాడు. నూతన కమిటీని ఆదివారం ఎన్నుకున్నారు. ప్రధాన కార్యదర్శిగా ఖాజా మొహినుద్దీన్, కోశాధికారిగా మామిండ్ల శ్రీనివాస్ ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు మదన్‌మోహన్‌రెడ్డి మాట్లాడారు. నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి సహకారంతో ఫర్టిలైజర్, పెస్టిసైడ్స్, సీడ్స్ డీలర్ల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు. తన ఎన్నికకు కృషి చేసిన డీలర్లకు రాంబాబు, కారుకూరి శ్రీను కృతజ్ఞతలు తెలిపారు.

ఏఈఓగా ఆబిద్ సేవలు అభినందనీయం



గీసుకొండ : ఏఈఓగా ఆబిద్ హుస్సేన్ మొగిలిచర్ల క్లస్టర్‌లోని ఐదు గ్రామాల రైతులకు అందించిన సేవలు అభినందనీయమని ఏఓ హరిప్రసాద్ బాబు, డీసీసీబీ డైరెక్టర్ దొంగల రమేశ్ అన్నారు. బదిలీ అయిన సందర్భంగా ఆబిద్ హుస్సేన్‌ను ఆదివారం సన్మానించారు. ఈ సందర్భంగా ఏఓ హరిప్రసాద్‌బాబు, డీసీసీబీ డైరెక్టర్ రమేశ్ మాట్లాడారు. ఏఈఓగా హుస్సేన్ రైతులకు నిత్యం అందుబాటులో ఉంటూ మెరుగైన సేవలు అందిస్తూ ఉద్యోగానికి వన్నె తెచ్చారని తెలిపారు. రైతులతో మమేకమై సూచనలు, సలహాలు అందించారని చెప్పారు. అనంతరం రైతులు, ఏఈఓలు ఆబిద్ హుస్సేన్‌ను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో డీసీసీబీ మొగిలిచర్ల శాఖ మేనేజర్ సౌందర్య, సొసైటీ డైరెక్టర్లు లింకలపెల్లి స్వామి, జనగాం శ్రీనివాస్, బిల్ల రవి, వనపర్తి కట్టస్వామి, రాజు, కల్పన, కందుల సునీత, ల్యాదల్ల అశోక్, పోషాల కిషన్, అప్పని సూరన్న పాల్గొన్నారు.

108 నైవేద్యాల సమర్పణ

హన్మకొండ: హనుమకొండ గోకుల్‌నగర్‌లో గోకుల్ గజానన మండలి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న గణపతి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఆదివారం 108 నైవేద్యాలు సమర్పించారు. కార్యక్రమంలో గోకుల్‌నగర్ మహిళలు తదితరులు పాల్గొన్నారు.

నిమజ్జనంలో డీజేలకు అనుమతి లేదు

- ఎస్సై ప్రమోద్‌కుమార్



డీజే నిర్వాహకులకు కౌన్సెలింగ్ ఇస్తున్న ఎస్సై ప్రమోద్‌కుమార్

శాయంపేట : వినాయక నిమజ్జనం ఊరేగింపులో డీజేలకు అనుమతి లేదని ఎస్సై ప్రమోద్‌కుమార్ డీజే నిర్వాహకులను సూచించారు. ఆదివారం మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్‌లో డీజే నిర్వాహకులకు కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ.. వినాయక నిమజ్జనం ఊరేగింపులో డీజేలు పెట్టొద్దని డీజేలు పెడితే సీజ్ చేస్తామని హెచ్చరించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా గణేశ్ ఉత్సవ కమిటీ నిర్వాహకులు సాయంత్రంలోపు నిమజ్జనాలు పూర్తి చేయాలన్నారు.

నిమజ్జన ప్రదేశాలను పరిశీలన

మండలంలోని పత్తిపాక–ప్రగతిసింగారం గ్రామాల మధ్య చలివాగు బ్రిడ్జి వద్ద గల గణేశ్ నిమజ్జన ప్రదేశాన్ని ఆదివారం తహసీల్దార్ సత్యనారాయణ, ఎస్సై ప్రమోద్‌కుమార్ పరిశీలించారు. నిమజ్జనం చేసే ప్రదేశాల్లో హైమస్ లైట్లు ఏర్పాటు చేయాలని పంచాయతీ కార్యదర్శికి సూచించారు. భక్తులు సహకరించాలని కోరారు.

కార్యకర్తలే పార్టీకి పునాది : కృష్ణారెడ్డి



కమలాపూర్ : మాట్లాడుతున్న కృష్ణారెడ్డి



దామెర : కోగిల్వాయిలో సభ్యత్వ రశీదును చూపిస్తున్న నాయకులు

కమలాపూర్ : కార్యకర్తలే పార్టీకి పునాదులని, వారి శ్రమతోనే క్షేత్రస్థాయి నుంచి బలోపేతం అవుతుందని బీజేపీ కరీంనగర్ జిల్లా అధ్యక్షుడు కృష్ణారెడ్డి అన్నారు. మండలంలోని భీంపల్లిని ఆదివారం ఆయన సందర్శించి సభ్యత్వ నమోదును పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడారు. బీజేపీ 18 కోట్ల కార్యకర్తల బలంతో ప్రథమ స్థానానికి చేరుకుందన్నారు. దేశ సంక్షేమం, అభివృద్ధి బీజేపీతోనే సాధ్యమని, అందుకే ప్రజలంతా బీజేపీ వైపు చూస్తున్నారని అన్నారు. పార్టీలో చేరేందుకు దేశ వ్యాప్తంగా అనేక మంది ఆసక్తి చూపుతున్నారన్నారు. గల్లీ నుంచి ఢిల్లీ వరకు పార్టీ జాతీయ నాయకత్వం సభ్యత్వ నమోదు కోసం తగిన కసరత్తు చేసిందని, అందులో భాగంగానే బీజేపీ శ్రేణులంతా సభ్యత్వ నమోదుపై దృష్టి సారించి ముందుకు సాగుతున్నారన్నారు. బీజేపీ మండల అధ్యక్షుడు అశోక్‌రెడ్డి, హుజూరాబాద్ అసెంబ్లీ కన్వీనర్ గౌతంరెడ్డి, సభ్యత్వ నమోదు కన్వీనర్లు నరసింహరాజు, వెంకట్‌రెడ్డి, మాజీ జెడ్పీటీసీ శ్రీరాం శ్యామ్, బండి కోటేశ్వర్, కో ఆర్డినేటర్లు ప్రవీణ్, భిక్షపతి, జిల్లా అధికార ప్రతినిధి శోభన్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

దామెర : గ్రామస్థాయి నుంచి బీజేపీని బలోపేతం చేసేందుకు ప్రతి కార్యకర్త కృషి చేయాలని జిల్లా ప్రధాన కార్యదర్శి కొండి జితేందర్‌రెడ్డి అన్నారు. మండలంలోని కోగిల్వాయిలో 77, 78 బూత్‌లలో ఆదివారం సభ్యత్వ నమోదు కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన హాజరై మాట్లాడారు. క్షేత్రస్థాయిలో పార్టీని బలోపేతం చేసేందుకు సభ్యత్వ నమోదు కార్యక్రమం చేపట్టినట్లు పేర్కొన్నారు. జిల్లాలో దామెర మండలం మొదటి స్థానంలో నిలవాలని ఆకాంక్షించారు. అనంతరం సభ్యత్వ నమోదులో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు జంగిలి నాగరాజు, బూత్ అధ్యక్షుడు చుక్క మహేందర్, జంగిలి రాజేందర్, శక్తికేంద్రం ఇంచార్జ్ కొండి ప్రేమ్ కుమార్, గడ్డం రాజేందర్, నాయకులు పాలకుర్తి శ్రీలత, స్పందన, కుమార్, నాగరాజు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

మూడుతరాల గురువుల ఆత్మీయ సమ్మేళనం



ఆత్మీయ సమ్మేళనానికి హాజరైన మూడుతరాల ఉపాధ్యాయులు

పరకాల : మండలంలోని నాగారం గ్రామంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో మూడుతరాల గురువుల ఆత్మీయ సమ్మేళనం ఘనంగా జరిగింది. ఆదివారం నాగారం గ్రామ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పనిచేసిన మూడుతరాలకు చెందిన 50 మంది ఉపాధ్యాయులు ఆత్మీయ సమ్మేళనం నిర్వహించుకున్నారు. నాగారంలో పుట్టిన ఉపాధ్యాయులు, పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయులు తమకు విద్యాబుద్ధులు నేర్పిన గురువులను (రిటైర్డ్ ఉపాధ్యాయులు) కలకొండ కృష్ణమూర్తి, చల్లా ముకుందారెడ్డి, కలకొండ శ్రీశైలం, మార్క శంకర నారాయణ, పింగిళి పాల్ ప్రేమానందరెడ్డి, మియ్యపురం సాంబమూర్తి, ఎరుకొండ సుధాకర్, మద్దెల సదానందం, దాసరి రవీందర్, దాసరి రమేశ్‌ను ఘనంగా సన్మానించారు. ఉపాధ్యాయులు సరిత, భిక్షపతి, భద్రయ్య, కోటయ్య, నర్సయ్య, జ్యోత్స్న, ధనలక్ష్మి, రుద్రమదేవి, రాజేంద్రమ్మ, నీలమ్మ, గణపతి, రాజేంద్రప్రసాద్, శ్రీనివాస్, చరణ్‌కుమార్, అనిల్‌కుమార్, రమేశ్‌బాబు పాల్గొన్నారు.

బాధితులకు గ్రామస్తుల ఆర్థిక చేయూత



బాలు కుటుంబ సభ్యులకు ఆర్థిక సాయం అందజేస్తున్న గ్రామస్తులు

శాయంపేట : ఇటీవల కురిసిన వర్షాలకు ఇల్లు కూలిపోయి నిరాశ్రయులైన బాధిత కుటుంబానికి గ్రామస్తులు తలోచేయి వేసి ఆర్థికంగా ఆదుకున్నారు. రూ. 25 వేల నగదు, క్వింటాల్ బియ్యం అందించి దాతృత్వాన్ని చాటుకున్నారు. మండలంలోని సూర్యనాయక్‌తండకు చెందిన జరుపుల బాలు పెంకుటిల్లు ఇటీవల కురిసిన భారీ వర్షాలకు కూలిపోయింది. కూలి పని చేస్తేనే పూట గడిచే కుటుంబ కావడంతో దిక్కుతోచని స్థితిలో పడిన బాధిత కుటుంబాన్ని మాజీ సర్పంచ్ భూక్య రమేశ్ ఆదుకునేందుకు దాతల సహాయం కోరారు. దీంతో స్పందించిన గ్రామస్తులు తలోకొంత పోగుచేసి రూ. 25 వేల నగదు, క్వింటాల్ బియ్యం అందించారు. మాజీ ఉపసర్పంచ్ వస్తం, మాజీ ఎంపీటీసీ రెడ్డి నాయక్, కాంగ్రెస్ గ్రామశాఖ అధ్యక్షుడు సుమన్, నాయకులు రవీందర్, జై, భాషా, సునీల్‌తో పాటు తదితరులు పాల్గొన్నారు.

భావితరానికి ఆదర్శం ‘మోక్షగుండం’



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ రజని

శాయంపేట : తాగు, సాగునీటి ప్రాజెక్టుల రూపశిల్పి మోక్షగుండం విశ్వేశ్వరయ్య భావితరానికి ఆదర్శమని, సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ రజని అన్నారు. మండల కేంద్రంలోని సాంఘిక సంక్షేమ బాలికల గురుకులంలో ఆదివారం మోక్షగుండం విశ్వేశ్వరయ్య 161 వ జయంతిని పురస్కరించుకొని ఇంజనీర్స్ డే వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె విశ్వేశ్వరయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం మాట్లాడుతూ.. మోక్షగుండం విశ్వేశ్వరయ్య 1861 సెప్టెంబర్ 15న బేస్తవారపేటకు చెందిన శ్రీనివాసశాస్త్రి, వెంకటలక్షమ్మకు జన్మించారని తెలిపారు. విశ్వేశ్వరయ్య భారత ఇంజనీర్‌గా గుర్తించబడినారని కొనియాడారు. ఉపాధ్యాయులు పూజ, స్వాతి, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.